ప్రజాశక్తి
బుధవారం 20 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

## ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-పాడేరు:** గ్రామ/వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19 వ తేదీ నుండి 22 వ తేదీ వరకూ(4 రోజులు), 26వ తేదీ నుండి 29వ తేదీ వరకూ(4 రోజులు) ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పిఎస్.కుమార్ కోరారు. ఈ విడతలో గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు అనాధ శరణాలయాలకు ప్రాధాన్యత ఇచ్చి, ఆధార్ కార్డు లేని వారికి నమోదు చేయించడానికి కృషి చేయాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆధార్ కార్డు లేని 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ కార్డు నిమిత్తం నమోదు చేయించాలని సూచించారు. ఆధార్ కార్డు లేని పిల్లల జాబితాలను మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ నమోదు తో పాటు, బయోమెట్రిక్ అప్డేట్స్, డాక్యుమెంట్స్ అప్డేట్ చేయించుకోవచ్చని తెలియచేసారు.

# సెల్ టవర్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

### -టెలీ కమ్యూనికేషన్స్ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్

**ప్రజాశక్తి-పాడేరు:** వినియోగ దారులకు నాణ్యమైన టెలికాం సేవలు అందించాలని కేంద్ర టెలి కమ్యూనికేషన్ల శాఖ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్ ఆదేశించారు. మండలంలోని వంజంగి గ్రామ సచివాలయం, ఎంపిపి పాఠశాల, డోకులూరు పంచాయతీ మండిపుట్టు గ్రామం వద్ద రూ.87 లక్షల వ్యయంతో నిర్మించిన బిఎస్ఎన్ ఎల్ సెల్ టవర్ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంజంగి పంచాయతీలో ఆశా కార్యకర్తలతో మాట్లాడి ఆసుపత్రి ప్రసవాలపై ఆరా తీసారు. ఆశా కార్యకర్తల పరిధిలో ఎంత మంది గర్భవతులు ఉన్నారని, గర్భవతులకు అందిస్తున్న వైద్య సేవలపై ప్రశ్నించారు. గత ఏడాది ఆసుపత్రి ప్రసవాలు ఎన్ని జరిగాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంజంగి మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానాన్ని పరిశీలించారు.

డోకులూరు పంచాయతీ మండిపుట్టు గ్రామంలో రూ.87 లక్షలతో నిర్మించిన బి ఎస్ ఎన్ ఎల్ సెల్ టవరును పరిశీలించారు. ముందుగా అక్కడ గిరిజనులు గిరిజన సాంప్రదాయంలో ఘనంగా స్వాగతం పలికారు. మొబైల్ టవర్, సోలార్ పవర్, పవర్ ప్లాంట్, ఈనోట్ బి సిగ్నల్ విధానాన్ని పరిశీలించారు. సెల్ టవర్ నిర్మాణంతో కమ్యూనికేషన్ పెరిగిందని, కొన్ని చిన్నపాటి మొబైల్ ఫోన్లలో సక్రమంగా మాటలు వినపడ లేదని గ్రామస్తులు అదనపు కార్యదర్శి దృష్టికి తీసుకుని వచ్చారు. సాంకేతిక కారణాలను వారం రోజుల్లో పూర్తి చేసి సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరచాలని బి ఎస్ ఎన్ ఎల్ అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశ మయ్యారు. మంజూరు చేసిన సెల్ టవర్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బి ఎస్ ఎన్ ఎల్, జియో సెల్, ఎయిర్ టెల్ సెల్ టవర్ల నిర్మాణాల పురోగతి పై సమీక్షించారు. బి ఎస్ ఎన్ ఎల్ టవర్ల నిర్మాణాలలో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. సెల్ టరప్ల నిర్మాణాలలో అలసత్వం ప్రదర్శిస్తే బి ఎస్ ఎన్ ఎల్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు, తాగునీటి పథకాల పనులను తర్వరితగతిన ప్రారంభించి పనులు వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. బి ఎస్ ఎన్ ఎల్ కు 565 టవర్లు మంజూరు చేయగా 157 పూర్తి చేసారని అన్నారు. జియోకి 465 టవర్లకు 413 పూర్తి చేసారని అన్నారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ 394 పనులకు 228 పూర్తి చేసారని చెప్పారు. సెల్ టవర్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించాలని ఐటిడి ఏ పిఒకు సూచించారు. అనంతరం మండలంలోని మోదాపల్లి కాఫీ తోటలను పరిశీలించారు. కాఫీ తోటలు, మిరియాల సాగు ద్వారా గిరిజన రైతులు పొందుతున్న ఆదాయాలను అడిగి తెలుసు కున్నారు. కాఫీ రైతులతో ముచ్చటించి ఐటిడి ఏ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అడిగి తెలుసు కున్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పి.ఓ . వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి ఎఫ్. ఓ .పి.వి. సందీప్ రెడ్డి, డి.ఆర్.ఓ . పద్మలత, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, నీతి ఆయోగ్ ప్రాగ్రాం అధికారి నారాయణ రెడ్డి, డిజి ఎంలు ఎం. సత్య ప్రసాద్, ఆర్ శ్రీకాంత్ పట్నాయక్, బివివి నగేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్.నంద్, గిరిజన సంక్షేమశాఖ ఇన్చార్జి ఉప సంచాలకులు ఎల్. రజని, డి. ఇ. ఓ బ్రహ్మాజీరావు, పి. హెచ్. ఓ ఎన్. అశోక్, కాఫీ బోర్డు డిడి. ఎస్.రమేష్, సిడిపి ఓ పి. ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

పిఒతో మాట్లాడుతున్న గుర్జార్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

## అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఎస్సి, ఎస్టి అత్యాచార నిరోధక చట్టంపై స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో రాజమహేంద్రవరం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ అడిషనల్ ఎస్పి అస్మ ఫర్వీన్ ఆధ్వర్యాన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి అస్మ ఫర్వీన్ ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న నేరాలు గురించి, వాటి నుండి చట్టరీత్యా వారికి ఎలా రక్షణ లభిస్తుందో తెలియజేశారు. ఎస్సి, ఎస్టి అత్యాచార కేసుల్లో అరెస్టులు జరిగినప్పటికీ ట్రయల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పకపోవడం వల్ల శిక్షలు పడటం లేదని, బాధితులు, సాక్షులు కోర్టుకు వచ్చి సాక్ష్యం సరిగ్గా చెప్పాలని సూచించారు. ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ ఎస్టి జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఐటిడిఎల వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, రిటైర్డ్ సీనియర్ పిపి గోపాలరావు, మాట్లాడారు.

సర్ది చెపుతున్న పోలీసులు

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

**ప్రజాశక్తి - చింతపల్లి :-** రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రదానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో పాల్గొని ఈ ముగ్గురు గిరి విద్యార్థులు 2 స్వర్ణం 1- సిల్వర్ పతకాలు సాధించారన్నారు. సిహెచ్. మహేష్ 61 కేజీల విభాగంలో, మహేష్, 57 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు, పి. రమేష్, 63 కెజిల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. విద్యార్థులతో ర్యాలీగా ఊరేగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస పాత్రుడు, ఫిజికల్ డైరెక్టర్ పి. శివకుమార్, అధ్యాపకులు డాక్టర్ డి. కెజియా. జగదీష్ బాబు, లైబ్రరియన్ జగత్ రాయ్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులతో అధ్యాపకులు

## రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

మండలంలోని బోర్ణగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సత్యనారాయణ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం రమేష్ బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. బిర్సా ముండా జయంతి వారోత్సవాల నేపథ్యంలో ఇటీవల రంపచోడవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్యనారాయణ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికైనట్లు హెచ్ఎం రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సత్యనారాయణను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## భీంపోల్ గ్రామసభలో ఘర్షణ

**ప్రజాశక్తి- అనంతగిరి:** మండలంలో భింపోల్ పంచాయతీ కేంద్రంలో జరిగిన గ్రామసభలో రసాబసగా మారింది. మంగళవారం సర్పంచ్ జన్ని బిమ్మాలమ్మ, కార్యదర్శి సిహెచ్ దేవా అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి తెలిపిన వివరాలు..ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనేక పథకాలు, కార్యక్రమాలు ప్రభుత్వ పరంగా సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ గతంలో జరిగిన పనుల వివరాలు ఇవ్వాలని కోరగా అందుకు సంబంధించిన వివరాలను తన దగ్గర లేవని బదులు ఇచ్చినా సరే గొడవ పడినట్లు తెలిపారు. ఈ గందరగోళంలో మాజీ సర్పంచ్ ఈశ్వరరావుకు స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. ఉప సర్పంచ్‌నీ విచారణ నిమిత్తం స్టేషన్‌కి తరలించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కార్యదర్శి దేవా తెలిపారు.

## గ్రంథాలయంలో పాటల పోటీలు

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:**గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కేజీబీవీ పాఠశాల నుంచి సుమారు వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా పాల్గొంటూ ఉండాలని గ్రంథాలయాధికారిని ఎస్ సునీత చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే సుబ్బారావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు

## గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు చర్యలు

**ప్రజాశక్తి-సీలేరు**

అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి సాగు, అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో దృష్టిసారించి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపడతామని జీకే వీధి సిఐ సి.వరప్రసాద్ వెల్లడించారు. జీకే.వీధి సిఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటిసారి సీలేరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎస్సై రవీంద్ర, సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వికాస్ పాండే సిబ్బందితో సమావేశమై స్టేషను భద్రత తదితర అంశాలపై ఆరా తీశారు. గంజాయి సాగు, అక్రమ రవాణా పై ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జీకే వీధి మండల పరిధిలో గంజాయి సాగు అక్రమ రవాణాకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా యువత సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన ధనం, డేటా చోరీకి గురి కాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాలు పాఠశాలలకు సిబ్బంది వెళ్లి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలు, మైనరు బాలికలపై అత్యాచారాలకి పాల్పడడం హేమమైన చర్య అని, అటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారికి ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై కే రవీంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ వర ప్రసాద్

బస్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిదులు

## ఆర్‌టిసి బస్ సర్వీస్ ప్రారంభం

**ప్రజాశక్తి-హుకుంపేట:**మండలంలోని చీకుమద్దుల కు నూతన ఆర్ టీ సీ బస్ సర్వీస్ ను మంగళవారం హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గన్నేరుపుట్టు సర్పంచ్ సోకేలి కృష్ణారావులు, ఆర్ టీ సీ ఎస్టీ ఎం సూపర్ వైజర్ అప్పారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వైఎస్ వైసీపీ మాట్లాడుతూ, బస్సు సౌకర్యం పునరుద్ధించడంతో రవాణా కష్టాలు తీరిందన్నారు. గిరిజనులు పండించే అటు ఉత్పత్తులను. మండలోని శనివారం వారపు సంతలో తేవడానికి సగం రవాణా ఖర్చులకే అయ్యేదని ఆయన అన్నారు. గతంలో ప్రైవేటు వాహనాల్లో అధిక లోడుతో ప్రయాణం చేపట్టి పలుమార్లు ప్రమాదాలు జరిగిన సందర్భం ఉందన్నారు. బస్సు సౌకర్యం రావడంతో కొంత రవాణా కష్టాలు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఆర్ టీ సీ డిపో ఎస్ టీమ్ ట్రాఫిక్ సూపర్ వైజర్ అప్పారావు, కాంప్లెక్స్ ఎస్ఎంటీ రమణ, డ్రైవర్ జీ దేముడు, కండక్టర్ ఎం.పూర్ణమ్మ, మాజీ సర్పంచ్‌లు దూసూరు కొండ బాబు, సూకూరు బొజ్జన్న, సూడిపల్లి లక్ష్మీ ప్రమీల పాల్గొన్నారు.



రోడ్డు పనులు చేపడుతున్న గిరిజనులు

## శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు

**ప్రజాశక్తి-అనంతగిరి:**వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు పనులను గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మరమ్మత్తు చేపట్టారు.మండలంలోని జీనాబాడు పంచాయతీ పరిది సరియా నుండి కిల్లో మీటర్ వాలబు వరకు ఉన్న రోడ్డు రెండు నెలల క్రితం కురిసిన వర్షాల కారణంగా రోడ్డుంతా మోకాళ్ల లోతు గోతులు ఏర్పడింది. సరియా గ్రామ గిరిజనులు ఇంటి ఇంటికి ఒకరు చొప్పున ముందుకు వచ్చి మరమ్మత్తు పనులు చేపటుకున్నారు. 108 అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి పలుమార్లు ప్రభుత్వంకు విన్నవించినపటికి పటిచుంకున్న నాదుడే లేడు. చేసేది ఏమీ లేక స్వచ్ఛందంగా గిరిజనులు ముందుకు వచ్చి మరమ్మత్తు చేపట్టాల్సి వచ్చింది. ఇప్పటి కైనా సరే ప్రభుత్వం శాశ్వతంగా బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

# అన్నవరం బ్రిడ్జిపై సిపిఎం ఆధ్వర్యాన బైఠాయింపు

- తాత్కాలిక వంతెనకు మరమ్మతులు చేపట్టాలి
- తక్షణమే హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి
- చింతూరు-విఆర్.పురం రహదారిలో ఆర్టీసీ బస్సులు నడపాలి
- తహశీల్దార్, ఎస్ఐ హామీతో ఆందోళన విరమణ

తహశీల్దారుకు సమస్యను తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-విఆర్.పురం**

మండలంలోని అన్నవరం-ఉమ్మడివరం మధ్య గల వాగుపై ఉన్న తాత్కాలిక వంతెనపై సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ఆ ప్రాంత ప్రజలు బైఠాయించారు. తాత్కాలిక వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని, చింతూరు నుండి రేఖపల్లి, విఆర్.పురం వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ల నుండి ఈ వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వాగుపై తాత్కాలిక వంతెన నిర్మించినా బ్రిడ్జికి ఇరువైపులా కాంక్రీట్ సైడ్ వాల్స్ ఏర్పాటు చేయకుండా మట్టి నింపడంతో గత వరదల్లో మొత్తం కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో బరువు ఉన్న వాహనాలు ఈ మార్గంలో తిరిగే పరిస్థితి లేదన్నారు. మూడేళ్లగా ఈ మార్గంలో బస్సులు తిరగడం లేదని, దీంతో చదువుల కోసం వెళ్లాల్సిన విద్యార్థులు, అనారోగ్యం కారణంగా రాజమండ్రి హాస్పిటల్‌కి వెళ్లాల్సిన ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల బస్తాలు తమ గ్రామాలకు తీసుకురావాలన్నా, రైతులు పండించిన వరి ధాన్యం, మిర్చి లాంటి పంటలను మండల కేంద్రానికి తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. మండలంలోని సుమారు 30 నుంచి 40 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇదే ప్రధానమైన మార్గమని, అయినా ఈ వాగుపై పూర్తి స్థాయి వంతెన నిర్మాణం చేయకుండా ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. గత నాలుగేళ్ల నుండి బ్రిడ్జి నిర్మిస్తామని హామీలు ఇస్తున్నారు తప్పితే కార్యరూపం దాల్చలేదన్నారు. తక్షణమే హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, అంత వరకు కూలడానికి సిద్ధంగా ఉన్న తాత్కాలిక వంతెనకు మరమ్మతులు చేయాలని, అప్రోచ్ రోడ్డు వేయాలని, చింతూరు నుండి విఆర్.పురం వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.

**నిలిచిన వాహనాలు.. స్పందించిన అధికారులు**

వంతెనపై బైఠాయింపుతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరారు. అధికారులు స్పష్టమైన హామీ ఇస్తేనే ఇక్కడ నుండి కదులుతామని సిపిఎం నాయకులు, ప్రజలు స్పష్టం చేయడంతో ఎస్సై సంతోష్ కుమార్, మండల తహశీల్దారు సరస్వతితో మాట్లాడారు. దీంతో ఆమె ధర్నా ప్రాంతానికి వచ్చి సిపిఎం నాయకులతో మాట్లాడారు. బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పాడై పోయి ప్రమాదభరితంగా ఉన్న మాట వాస్తవమేనని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సిపిఎం నాయకులు, ప్రజలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, చిన్నమటపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, పార్టీ నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కమ్మిచిచ్చు సత్యనారాయణ, గుండిపుడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్, పులి బొజ్జి, శ్రీరపు తాతబాబు, నాల్లారపు ప్రకాష్ రావు, చల్ల హాజరత్, సోడి మల్లయ్య, సుబ్బారావు, మొగలిపువ్వు సతీష్, శ్యామల వెంకటరామయ్య, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బైఠాయింపుతో తాత్కాలిక వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

## మరుగుదొడ్ల వాడకంపై అవగాహన

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

మారేడుమిల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బహిరంగ మలవిసర్జన చేయరాదని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక వై జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమం హెచ్ఎం వినాదేవి, మారేడుమిల్లి ఎస్సై రాము, పంచాయతీ కార్యదర్శి పి.విజయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## దళారుల చేతుల్లో కాఫీ రైతులు మోసపోవద్దు

**ప్రజాశక్తి -సీలేరు :** కాఫీ రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని కాఫీ బోర్డు కోఆర్డినేటర్ చిన్నారావు, ఎ.దారకొండ పంచాయతీ సర్పంచ్ ఎం.సత్యవతి కాఫీ రైతులకు సూచించారు. జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ పెబ్బంపల్లి కాఫీ రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన కాఫీ పండులను దళారులకు అమ్మి మోసపోతున్నారని, శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళారుల చేతిలో మోసపోకుండా ఐటిడిఏ మ్యాక్స్ జిసిసి సంయుక్తంగా కాఫీ పళ్ళు, చెర్రీ, పార్చ్మెంట్ కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీడీఏ మ్యాక్స్ కాఫీ పళ్ళు కిలో 44 రూపాయలు, జిసిసి చెర్రి కిలో 150 రూపాయలు కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. శుద్ధి చేసిన కాఫీ కిలో రూ.285 కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గిరి రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఐటీడీఏ మ్యాక్స్ జిసిసికి విక్రయాలు జరిపి అధిక లాభాలు ఆర్జించాలని సూచించారు. లైజాన్ వర్కర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఎస్ఒపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

### ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పెదబయలు: అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కొత్తూరు కేజీబీవీ కళాశాలలో కార్తీక పౌర్ణమి రోజున 23 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలపై జరిగిన సంఘటన పై ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా పెదబయలు మండల కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండ సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిని ధర్మానపడాల్, బొండా గంగాధరం మాట్లాడుతూ, జి.మాడుగుల కస్తూర్బా గాంధీ కళాశాల ఎస్ఒ విద్యార్థినిలను ఎండలో నిలబెట్టి జుట్టు కత్తిరించడం అన్యాయమన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న కళాశాల ఎస్ఒపై వెంటనే క్రిమినల్ చర్యలు చేపట్టి అరెస్టు చేయాలని, లేనియెడల విద్యార్థినిలు తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు.

**హుకుంపేట:** జి మాడుగుల మండలంలో జుట్టును కత్తిరించిన స్పెషల్ ఆఫీసర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల జుట్టు కత్తిరించడ్డా ఆమె తప్పు పట్టారు. మనోభావాలను దెబ్బతీసే విధంగా వాళ్లకు మానసికంగా హింసించడం సరైన పద్ధతి కాదన్నారు. పిల్లలకి మంచి పోషికాహారం అందించాలన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె కోరారు.

## ఇందిరాగాంధీకి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పాడేరు: భారత దేశంలో పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కృషి ఎనలేనిదని పాడేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శతక బుల్లిబాబు చెప్పారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పాడేరులో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశానికి తొలి మహిళా ప్రధానిగా ప్రత్యేకంగా మహిళలకు ఉత్తమ సేవలు అందించి ఆదర్శంగా నిలిచారని అన్నారు. దేశంలోనే భారతరత్న అవార్డు అందుకున్న యావత్ మహిళా లోకానికి స్ఫూర్తి అని కొనియాడారు. ఒక మహిళగా దేశంలో చరిత్ర సృష్టించారని, జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఆమె చేసిన కృషి అపారమైనదని గుర్తు చేసుకున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి కూడా ఇందిరాగాంధీ స్ఫూర్తితో తమను నడిపించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంతల కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వాముల సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు కృష్ణ కుమారి, సీనియర్ నాయకుడు కూడ సింహాచలం, నాయకులు పాంగి నవీన్, సోమేష్, మాజీ సర్పంచ్ బి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నిర్మల

## సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక సెంటాన్స్ పాఠశాల విద్యార్థులు విశాఖ నగరంలోని ఈనెల 18న సెయింట్ ఆన్స్ స్కూల్ వేదికగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభను కనబరిచినట్లు స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ నిర్మల మంగళవారం విలేఖరులకు తెలిపారు ఉపాధ్యాయులు శివ, కేశవరావు, మధు మురళి విద్యార్థులను అభినందించారు.

# కమ్మేసిన మంచు

దట్టంగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి - చింతపల్లి :- గడచిన రెండు మూడు రోజులుగా మన్య ప్రాంతాన్ని చలి పులి వణికిస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని మన్యం (ఏజెన్సీ) మండలాలపై చలి పులి పంజా విసురుతోంది. గడచిన రెండు మూడు రోజుల వరకు అల్పపీడన ప్రభావంతో అంతంతమాత్రంగా పెరిగిన ఉష్ణోగ్రతలు, అల్పపీడన ప్రభావం సడలిపోవడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు దిగజారుతున్నాయి. మన్య ప్రాంతంలో దట్టమైన వక్ష సంపద (అడవి) ఉండడంతో గిరిజన గ్రామాలలో ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. ఉదయం, సాయంత్రం వేలల్లో మంచు ప్రభావంతో బయటికి వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినా చలితీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో గిరిజన ప్రాంతంలో ప్రజలు రాత్రి 7 గంటల నుంచి ఇళ్లకు పరిమితమవు తున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లవలసిన వారు మాత్రం ఉన్ని దుస్తులు ధరించకుండా బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ గ్రామాలలో గిరిజనులు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. పెరుగుతున్న చలి తీవ్రత వలన మన్య ప్రాంతంలో స్వెటర్లు, మంకీ క్యాపులు, ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత క్షీణించి చలి తీవ్రత పెరిగే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాస్త్రవేత్తలు అంచన వేస్తున్నారు.

మంట కాగుతున్న గిరిజనులు

# మరుగుదొడ్ల వినియోగంపై ర్యాలీ

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- అరకులోయ:మరుగుదొడ్ల వాడకం, పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్య పడుతుందని మాడగడ సర్పంచ్ జ్యోతి.. అన్నారు. అరకువేలి మండలం మాడగడ గ్రామంలో జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులు మరుగుదోడ్ల వాడకంపై ర్యాలీ చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ గారు మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాలరాజు, నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి భోగిరాజు, ఏ ఎన్.ఎం కమల, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్షిప్ లో కూడా ఎంపీడీవో లవ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు మరుగుదొడ్లు వినియోగించుకోవాలని ప్లే కార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దలబుడు మేజర్ పంచాయితీ ఈవో రాజ్ కుమార్ ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:మండలంలోని కించాయి పుట్టు పంచాయతీ పరిధిలో ముంచింగి పుట్టు ఆర్ అండ్ బి ప్రధాన రహదారి నుండి దారపల్లి మీదుగా రాములు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైన రోడ్డును మరమ్మత్తులు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, గడ్డిబంధ రహదారి మరమ్మత్తులు చేపట్టక పోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. గడ్డి బంధం, రాములు గ్రామస్తులతో ధ్వంసమైన పిఆర్ రోడ్డు సమీపంలో చేరి ఆందోళన చేసామన్నారు. గత వైసిపి ప్రభుత్వ హాయంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, జిల్లా కలెక్టర్‌కు స్పందనలో దరఖాస్తులు పెట్టుకున్నప్పటికి ఫలితం లేదన్నారు. రహదారి గుంతలతో గర్భిణీ స్త్రీలకు, రోగులకు ఆసుపత్రికి తరలించాలన్నా కష్టంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

## నేరాలు ఘోరాలు

### 145 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హుకుంపేట: అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని, గంజాయిని సీజ్ చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ సురేష్ తెలిపారు.మండల కేంద్రంలోని దిగుడుపుట్టు జంక్షన్ వద్ద మంగళవారం పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న కారు, బైక్‌లో 145 కేజీలు గంజాయి స్వాధీనం చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నామన్నారు. ఒకరు పరారైనట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.పైలెట్గా ముందు పల్సర్ బైక్ పై ఇద్దరు వ్యక్తులు చూసి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో గమనించి వెనక్కి వెళ్లిపోవటకు ప్రయత్నించుగా అనుమానంతో పరిశీలించి కారులోన గంజాయి ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు.ఒడిస్సా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లా చిత్రకొండ మండలం తెంతులుగుడా గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

## రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చింతపల్లి : పంచాయతీ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రహదారిని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మేల లలిత కోరారు. పంచాయతీ కేంద్రంలోని మాలివీధిలో వంద మీటర్ల సిమెంటు రహదారి నిర్మాణ పనులకు తెదేపా సీనియర్ నాయకుడు దేపూరు వెంగళయ్య, వైకాపా సీనియర్ నాయకుడు సింహాచలం, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిడారితో నాయకులు

## కిడారికి అభినందన

ప్రజాశక్తి - చింతపల్లి : గిరిజన సహకార సంస్థ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తెదేపా నాయకుడు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ను విశాఖలోని సంపత్ వినాయక ఆలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన తెదేపా చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణ చందరావు, ఐ టిడిపి ఇంచార్జ్ మహేంద్ర, సీనియర్ నాయకులు అబ్బాయినాయుడు, కేశవ్, రొబ్బా యస్వంత్ తదితరులు. తెలిపారు.

## ప్రధానిని కలవడం ఆనందంగా ఉంది

ప్రజాశక్తి-అరకు లోయ : భారత ప్రధాని నరేంద్ర మోడీని కలవడం ఆనందంగా ఉందని గిరిజన మహిళ స్వాభి గంగమ్మ అన్నారు. బీహార్‌లో ప్రధాని మోడీ తో ముఖాముఖి అయి మాట్లాడిన అరకులోయ మండలం కొత్తభల్లు గూడ పంచాయతీ గద్యగుడ గ్రామానికి చెందిన స్వాభి గంగమ్మ, రామచందర్ లకు ఇక్కడ సన్మానం. నిర్వహించారు. గిరిజన ప్రాంత ఉత్పత్తులు, అభివృద్ధి సమస్యలు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి, ఐటిడిఏ, గిరిజనుల తరపున తెలియజేసే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. బిర్సా ముండ జయంతి సందర్భంగా అల్లూరి జిల్లా కొత్త బళ్ళుగూడ గ్రామంలో జరిగిన పీఎం జన్మన్ ప్రోగ్రాంలో వర్చువల్ గా ప్రధాని తో గిరిజనుల అభివృద్ధి కోసం మాట్లాడారు. ఇందుకు మెచ్చుకున్న ప్రధాని గత నెల ఝార్కండ్ లో,ఈనెల 15 న బీహార్ లో జరిగిన బిర్సా ముండ జయంతి కార్యక్రమంలో ప్రధానితో నేరుగా మాట్లాడి గిరిజన ప్రాంత అభివృద్ధి, సమస్యలు గూర్చి వివరించడం జరిగిందన్నారు.

## గురుకులంలో కార్తీక వనసమారాధన

కార్తీక వనసమారాధనలో నృత్యాలు చేస్తున్న గురుకుల విద్యార్థినులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక గురుకుల పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కార్తీకవన సమరాధన కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేరింతలతో విద్యార్థులు చేసిన నత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సకాలంలో అపార్ రిజిస్ట్రేషన్లు: డిఇఒ

ప్రజాశక్తి- ఆనందపురం : విద్యార్థుల అపార్ రిజిస్ట్రేషన్లను సకాలంలో పూర్తి చేయాలని డిఇఒ ప్రేమ్ కుమార్ ఆదేశించారు. మంగళవారంపెద్దిపాలెం నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు, హెచ్ఎంలు అపార్ నమోదుపై దృష్టిపెట్టాలన్నారు. దీనికిగాను మండలంలో ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు

ఈ సందర్భంగా ఎఫ్ఎ 1,ఎఫ్ఏ 2 మార్క్స్ నమోదు, విద్యార్థులు డ్రాపోర్ట్స్ డ్రాప్స్‌పై సమీక్షించి, తగిన సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల యాక్షన్ ప్లాన్ పూర్తిస్థాయిలో ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. సిలబస్‌లు పూర్తిచేసేందుకు పాఠశాలల పనివేళలను పెంచాలన్న ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు మండలంలో ఒక జెడ్‌పి ఉన్నతపాఠశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహించాలని ఆదేశించారు ఎంఇఒలు రవీంద్రబాబు, గంగరాజు, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్న ఫార్మసిస్ట్ అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారంలో ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఫార్మసిస్ట్‌ను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఫార్మాసిస్ట్ కడియం శ్రీనివాసరావు, ఏడాదిగా విశాఖ కేంద్రకారాగారంలో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం కేంద్రకారాగారానికి వెళ్తుండగా, జైలు ప్రధాన ద్వారం వద్ద సాధారణ తనిఖీలో భాగంగా శ్రీనివాసరావు బ్యాగ్‌లోని లంచ్ క్యారేజీలో కొన్ని పొట్లాలను లభించగా,. వాటిని విప్పి చూడగా గంజాయి ఉన్నట్లు జైలు అధికారులు గుర్తించారు. జైలు పర్యవేక్షణాధికారి కిషోర్ కుమార్ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద దొరికిన 90 గ్రాముల గంజాయిని సీజ్ చేసారు.

## ఆరో రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-భీమునిపట్నం :తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జివింఎసి జోనల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి ఆరో రోజుకు చేరాయి.ఈ సందర్భంగా మత్య కార నాయకులు గంటా నూకరాజు మాట్లాడుతూ, తీరంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్య కార నాయకులు వి సత్యారావు, డి నాగరాజు, కె నరసింగరావు, ఎ నరసింగరావు, కొక్కిరి అప్పన్న పాల

# బాలల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-విఆర్.పురం : బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య అన్నారు. మండలంలోని ఏఎస్‌డిఎస్ రేఖపల్లి ప్రాంగణంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలికలపై లైంగిక దోపిడీ, లైంగిక వేధింపుల గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ బాల్య వివాహ వివాహం చేసుకుంటే వారి జీవితాలు ఎలా పాడవుతాయని పిల్లలకు చెప్పడం జరుగుతుందన్నారు.

ఎటపాక సీఐ ఎన్ కన్నప్ప రాజు మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న వేధింపులను తట్టుకోని నిలబడాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేషన్ ఐసిడిఎస్ వివిధ రంగాలలో సర్వీస్ అందించిన వారికి ప్రశంసపత్రాలు మెమెుటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నేత వాళ్ల కృష్ణారెడ్డి, ఎంపీడీవో శశి భూషణరావు, ఎస్సై ఎం.సంతోష్, డాక్టర్ అనిల్, సిడిఆర్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ మంగతాయారు, ఐసిడిఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య

# తాను మరణించి... నలుగురికి జీవన దానం

- బ్రెయిన్ డెడ్ వ్యక్తి మృతదేహానికి కలెక్టర్ హరేంధిరప్రసాద్ నివాళి

రామారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -గాజువాక/ ఆరిలోవ : తాను చనిపోతూ మరో నలుగురికి జీవనదానం చేశారు విశాఖకు చెందిన వ్యక్తి వాసిరెడ్డి రామారావు. వివరాలివి. ఈ నెల 17న దువ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వాసిరెడ్డి రామారావు (57) తలకు తీవ్రగాయాలై అపస్మాక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించగా, మెదడులో తీవ్ర రక్తస్రావం అవుతుందని గుర్తించి, అతని ప్రాణాలు కాపాడడానికి వైద్యులు రెండు రోజుల పాటు శ్రమించారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు.

తర్వాత అవయవదానంపై రామారావు కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించగా, వారు అంగీకారం తెలపడంతో జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రామారావు శరీరంలో పనిచేస్తున్న ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, ఇతర అవయవాలను సేకరించి, జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం నలుగురికి కేటాయించారు. సేకరించిన అవయవాలను గ్రీన్‌ఛానల్ ద్వారా బాధితులకు చేరవేసి అమర్చారు. రామారావు చనిపోతూ మరో నలుగురు జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

**మృతదేహానికి కలెక్టర్ ఘన నివాళి**

తాను మరణిస్తూ, నలుగురు జీవితాల్లో వెలుగులు నింపిన రామారావు పార్థీవ దేహానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మంగళవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జిఒ 95 ప్రకారం రామారావు మృతదేహానికి గౌరవ వందనం చేస్తూ ఘన వీడ్కోలు పలికారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రంతో పాటు అంతక్రియలకు రూ.పదివేలను అందించారు. ఈసందర్భంగా అవయవ దానానికి ముందుకు వచ్చిన రామారావుకు కుటుంబసభ్యులను, ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యబృందానికి, అలాగే అవయవాల తరలింపునకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటుచేసిన సిపి శంకబ్రత బాగ్చీ, పోలీసులకు కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**రామారావు కుటుంబం స్ఫూర్తిదాయకం : కలెక్టర్**

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన బాధలో కూడా మరో నాలుగు కుటుంబాలలో సంతోషం నింపాలన్న ఆలోచనతో రామారావు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తూ దుర్భర జీవితాలను గడుపుతున్న నాలుగువేల మంది రోగులకు రామారావు కుటుంబం తీసుకున్న నిర్ణయం ఎంతో ధైర్యాన్నిస్తుందన్నారు. రోడ్డు ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత ఎక్కువై రామారావు మృతి చెందాడని, వాహనదారులంతా హెల్మెట్ ధారణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అవయవదానంపై విస్తత ప్రచారంతో ప్రోత్సహిస్తున్న జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు కృషిని అభినందించారు.

**అవయవదానంపై అపోహలు వీడాలి**

అవయవదానంపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో చైతన్యవంతులైన ప్రజలు, ఇటీవల కాలంలో బ్రెయిన్‌డెడ్ అయిన రోగుల అవయవాలను దానం చేసేందుకు వారి కుటుంబసభ్యులు ముందుకు వస్తున్నారనిజీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. అవయవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో రోగులు ఎదురుచూస్తున్నారన్నారు. అవయవదానంపై అపోహలను వీడి, బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఎపిలో ప్రకృతి వ్యవసాయ విధానం దేశానికే మార్గదర్శకం

- కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది

పద్మనాభం మండలం కోరాడలో వివిధ రకాల విత్తనాలను పరిశీలిస్తున్న కేంద్రబృందం

ప్రజాశక్తి -భీమునిపట్నం :రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు దేశానికే మార్గదర్శకమని కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది ప్రశంసించారు.మంగళవారం మండలంలోని మజ్జిపేట గ్రామంలో 18 దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ కార్యదర్శులు, అధికారుల బృందసభ్యులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి,సాగుపద్ధతులపై అధ్యయనం చేశారు.కిషోర్, తదితర రైతులుఉమ్మడిగా 8.2 ఎకరాల్లో సాగుచేస్తున్న కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించారు. ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో విత్తన గుళికలతో సాగు చేస్తున్న రబీ డ్రై సోయింగ్ డెమో విధానాన్ని పరిశీలించారు. అరటిలో పాలిక్రాపింగ్ మోడల్స్, ఎన్ పుట్స్ తయారీ కేంద్రం, స్టాక్ పాయింట్లను సందర్శించారు. ఘన, ద్రవ, జీవామృతాల తయారీ విధానాన్ని పరిశీలించారు. మామిడిలో అరటితో పాటు ఇతర అంతర పంటలను వేసిన పొలాలను పరిశీలించారు.మామిడి, కొబ్బరి, అరటి, టాపియోకా, ఒక్రా, పాలీ క్రాపింగ్ మోడల్, ప్రీ, మాన్సూన్ డ్రై సోయింగ్ క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులతో పలు అంశాలపై మాట్లాడారు.వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికతను ప్రదర్శించే కార్యక్రమం, ప్రకృతి వ్యవసాయ ఇన్ పుట్స్ ప్రదర్శన నిర్వహించారు

క్షేత్రస్థాయి పర్యటనలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ (పాలసీ అండ్ కో ఆర్డినేష న్) పేరిన్‌దేవి, ఎపి రాష్ట్ర వ్యవసాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బుడితి రాజ శేఖర్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి విజయ్‌కుమార్, ఆయిల్ సీడ్, క్రెడిట్ అదనపు కార్యదర్శులు మణిందర్ కౌర్ ద్వివేది, శుభా ఠాకూర్, డాక్టర్ ప్రకోప్ కుమార్ మేఘర్ధ, జాయింట్ సెక్రటరీ అజిత్ కుమార్ సాహు, ఎన్ఆర్ఎం, ఆర్ఎఫ్ఎస్ జాయింట్ సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పద్మనాభం:** మండలంలోని కోరాడ గ్రామంలో కోరాడ లక్ష్మణ అనే రైతు పొలంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో పండిసున్న వరిపంటను కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది నేతృత్వంలోని కేంద్రబృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వివిధ రకాల చిరుధాన్యాలు, ఇతర విత్తనాల ప్రదర్శనను తిలకించారు. మండల వ్యవసాయాధికారి ఎంవి.చలం ఉన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో తేజశ్రీకి రజతం

ప్రజాశక్తి- సీతమ్మధార : 68వ ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, అండర్ -19 బాలిక విభాగంలో డాక్టర్ లంకపల్లి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపిసి సెకెండియర్ విద్యార్థిని పి. తేజశ్రీ,45 కేజీల విభాగంలో రజత పతకాన్ని సాధించింది. గుడివాడ ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. రజత పతక విజేత తేజశ్రీని కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.